www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 200 | హైదరాబాద్ | మంగళవారం | 11-11-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## ప్రజాకవి అందెశ్రీకి అశ్రునివాళి..

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**చేర్యాల, నవంబర్ 10 (సిద్దిపేట పవర్)**



తెలంగాణ రాష్ట్ర గీతా రచయిత, ప్రజాకవి అందెశ్రీ మృతి రాష్ట్రానికి, సాహితి రంగానికి తీరని లోటు. ప్రజల బాధలే ఇతివృత్తంగా తన కలంతో సమాజాన్ని మేల్కొల్పిన కవియోధుడు అందెశ్రీ. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమంలో తన ఉద్యమ పాటలతో తనదైన పోరాటాన్ని సాగించిన పోరాట యోధుడు అందెశ్రీ. జనగామ నియోజకవర్గం లోని మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో జన్మించిన అందెశ్రీ సాహితీ రంగంలో తనదైన ముద్ర వేశాడు. తన రచనలతో ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టిన అందెశ్రీ మృతి బాధాకరం. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను అని తెలిపారు



# అందెశ్రీ అస్తమయం

## గుండెపోటుతో అకస్మాత్తుగా కన్నుమూత

- సీఎం రేవంత్, కేసీఆర్ సహ ప్రముఖుల నివాళి
- మూగబోయిన తెలంగాణ ఆత్మ
- పల్లెపదాలకు చిరునామా

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

ప్రముఖకవి అందెశ్రీ కన్నుమూశారు. పల్లె పదాలకు చిరునామా అయిన ఈ ప్రజాకవి ఇక లేరు. తెలంగాణ ఆత్మను ప్రపంచానికి తెలియజెప్పిన గొప్ప కవి అందరినీ విడిచివెళ్లారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం అందించిన గొప్ప కవి దిగంతాలకు చేరుకకున్నారు. అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. సోమవారం ఉదయం గుండెపోటుతో హైదరాబాద్‌లో కన్నుమూశారు. గాంధీ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ఆయనను మృతుడిగా ప్రకటించారు. ఆయన వయసు 64 సంవత్సరాలు. తెలంగాణ సాహిత్య వర్గాల నుంచి రాజకీయ వేదికల వరకు దిగ్భ్రాంతి వ్యక్తమైంది. "పల్లె వాడి మాటలతో ప్రజల హృదయాల్లో నినదించిన ఆ గళం మౌనమైపోయింది" అని ప్రముఖులు కంటతడి పెట్టారు.

**గొర్రెల కాపరి నుంచి గేయకారుడిగా**

1961లో సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో పేద రైతు

మిగతా 2లో



# ఎయిర్‌పోర్టు తరహాలో సికింద్రాబాద్ స్టేషన్

- అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తాం
- రూ.715 కోట్లతో అభివృద్ధి పనులు
- వచ్చే ఏడాది డిసెంబర్‌లో
- ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

హైదరాబాద్ నగరానికి ద్వారంలా నిలిచే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, త్వరలోనే తన రూపు రేఖలను మార్చుకోబోతోంది. శతాబ్దంపైగా చరిత్ర కలిగిన ఈ స్టేషన్ ఇప్పుడు ఆధునిక మౌలిక వసతులతో, సౌకర్యాలతో కొత్త శకానికి పునాది వేస్తోంది. దేశంలోని ప్రధాన రైల్వే జంక్షన్‌లలో ఒకటైన ఈ స్టేషన్‌ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో తీర్చిదిద్దాలన్న కల కేంద్రమంత్రి జీ. కిషన్‌రెడ్డిది. ఆ కల ఇప్పుడు ఆచరణలోకి వస్తోంది. సోమవారం ఆయన సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, "రూ. 715 కోట్ల వ్యయంతో సికింద్రాబాద్ స్టేషన్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరిస్తున్నాం. ఇది సాధారణ పునర్నిర్మాణం కాదు... భవిష్యత్ ప్రయాణ అవసరాలను

మిగతా 2లో



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

- 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- మొత్తం 4 లక్షల మందికి పైగా ఓటర్లు
- 407 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
- పోలింగ్‌పై డ్రోన్‌లతో నిఘా : సీఈవో సుదర్శన్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది. నేడు జరగనున్న ఈ పోలింగ్‌లో గెలుపు, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో దీనిని అన్ని పార్టీలు జీవన్మరణ సమస్యగా భావిస్తున్నాయి. ఈ కీలక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ (సీఈఓ) సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. సీఈఓ వెల్లడించిన వివరాల ప్రకారం, మొత్తం 139 ప్రాంతాలలో 407 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం (ఈసిఐ) నిబంధనల ప్రకారం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద కనీస మౌలిక సదుపాయాలను కల్పించారు. వీటితో పాటు, ప్రత్యేకంగా ఐదు 'మోడల్ పోలింగ్ స్టేషన్లను' సైతం ఏర్పాటు చేశారు. ఈ మోడల్ స్టేషన్లలో ఓటర్లను ఆకట్టుకునేలా అదనపు సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. మహిళల కోసం కూడా పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల భద్రతకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 68 పోలింగ్

మిగతా 2లో



03

## ధాన్యం కొనుగోళ్లలో కొత్త మైలు రాయి

- రికార్డ్ స్థాయిలో ధాన్యం సేకరణ
- తప్పుడు ప్రచారం అరికట్టాలి
- చెల్లింపులు 48 గంటల్లోనే పూర్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



## అమ్మకానికి రాజీవ్ స్వగృహ ప్లాట్లు

- ఈ నెల 17, 18న బహిరంగ వేలం
- 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

03



## ముమ్మరంగా తమ్మిడికుంట పునరుద్ధరణ

- పరిశీలించిన హైడ్రా కమిషనర్
- ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా
- ఆక్రమణలతో పాటు పూడికను తొలగించిన హైడ్రా
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని రంగనాథ్ సూచన

03



## ఉలిక్కిపడ్డ దేశ రాజధాని

ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు

13 మంది మృతి.. 21 మందికి తీవ్ర గాయాలు

- సిగ్నల్ దగ్గర ఆగిన కారులో ఒక్కసారిగా పేలుడు
- సమీపంలోని వాహనాలు ధ్వంసం.. మంటలు
- ఉగ్ర కుట్ర కోణంలోనూ పోలీసుల దర్యాప్తు
- ఢిల్లీ, ముంబై సహా ప్రధాన నగరాల్లో హై అలర్ట్
- ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ విచారం

03

## హైదరాబాద్‌లో నాకా బందీ!

దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు ఎఫెక్ట్



03

# విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీ

- చీరలు, మిక్సీలు కూడా పంచిపెట్టారు
- ఈసీకి హరీశ్ రావు ఫిర్యాదు, ఆధారాల సమర్పణ
- ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా డబ్బులు పంచుతారా?
- మాజీ మంత్రి హరీశ్ రావు



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ విచ్చలవిడిగా మద్యం, నగదు పంపిణీ చేస్తోందని, లక్షకు పైగా చీరలు, మిక్సీలు, ఇతర బహుమతులను ఓటర్లకు ఎరగా వేస్తోందని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ముఖ్యనేత, మాజీ మంత్రి టీ. హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన పార్టీ నేతలతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని (సీఈఓ) కలిసి అధికారిక ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదు అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు, అన్ని ఆరోపణలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, ఇతర ఆధారాలను ఎన్నికల సంఘానికి అందజేసినట్లు వెల్లడించారు.

**అధికార దుర్వినియోగంపై చర్యలు కోరిన హరీశ్‌రావు**

ఉప ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై తక్షణ చర్యలు

మిగతా 2లో



# విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీ

మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలని హరీశ్‌రావు ఎన్నికల సంఘాన్ని (ఈసీ) కోరారు. "కాంగ్రెస్ నేతలు ఓటర్లను కొనుగోలు చేయడానికి మద్యం సీసాలు, నగదు బస్తాలు, చీరలు, మిక్సీలు, గృహోపకరణాలు విరివిగా పంపిణీ చేస్తున్నారు. ఇది ఎన్నికల నియమావళికి తూట్లు పొడుస్తోంది" అని ఆయన మండిపడ్డారు. అదనంగా, సీ విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ, కొందరు పోలీసు అధికారులు ఈ ఫిర్యాదులను పట్టించుకోవడం లేదని, ఇది అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సమస్యాత్మక బూత్‌ల్లో కేంద్ర బలగాలు, మహిళా సిబ్బంది నియమకం కోరిక**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను ఈసీకి సమర్పిస్తూ, ఆ బూత్‌ల వద్ద కేంద్ర బలగాలను మోహరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. "ప్రత్యేకించి మహిళా పోలీసు అధికారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలను నియమించాలి. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి" అని సూచించారు. అంతేకాదు, నకిలీ ఓటర్ కార్డులు తయారు చేసిన ఆధారాలు, సంబంధిత వీడియోలను ప్రధాన ఎన్నికల అధికారికి అందజేశామని, దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని హరీశ్‌రావు తెలిపారు.

**6 గ్యారంటీల సమీక్ష ఓటర్ల ప్రభావితం కోసమే?**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. "గత రెండేళ్లుగా ముఖ్యమంత్రికి ఆరు గ్యారంటీలపై సమీక్ష నిర్వహించే సమయం దొరకలేదు. కానీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ముందు ఈ రోజు 6 గ్యారంటీలపై రివ్యూ మీటింగ్ పెట్టడం ఎందుకు? ఇది స్పష్టంగా ఓటర్లను ప్రభావితం చేయడానికి చేస్తున్న డ్రామా. ఓటమి భయంతోనే రేవంత్‌రెడ్డి మోకాళ్లపై తిరుగుతున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ దివాలాకోరు రాజకీయాలు ప్రజలకు బాగా అర్థమయ్యాయని, రేవంత్‌రెడ్డి ఎన్ని నాటకాలు ఆడినా జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో ముందే నిర్ణయించుకున్నారని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

**ఓటర్లు బుద్ధి చెబుతారు**

"అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంత అధికార దుర్వినియోగం జరిగినా ఎన్నికల అధికారులు పట్టించుకోకపోయినా... జూబ్లీహిల్స్ ఓటర్లు తగిన రీతిలో బుద్ధి చెబుతారు. అన్ని విషయాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకొచ్చాం. ఇక చర్యలు తీసుకోవడం ఈసీ బాధ్యత" అని హరీశ్‌రావు హెచ్చరించారు. ఈ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని, ప్రజలు అధికార దుర్వినియోగాన్ని తిప్పికొడతారని ఆయన అన్నారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రాజకీయ ఉద్రిక్తతలను మరింత పెంచింది. బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థికి మద్దతుగా హరీశ్‌రావు ఈ ఆరోపణలు చేయడం గమనార్హం. ఎన్నికల సంఘం ఈ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.



# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

స్టేషన్లను 'క్రిటికల్' (సమస్యాత్మక) పోలింగ్ స్టేషన్లుగా గుర్తించారు. ఈ కీలక ప్రాంతాల్లో స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేకంగా సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీని వాడుతున్నారు. అంతేకాకుండా, 100% పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించనున్నట్లు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే, ప్రజలు 24/7 అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వవచ్చు. జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేసే ఈ కంట్రోల్ రూమ్‌తో పాటు, '1950' అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి కూడా తమ ఇబ్బందులను తెలియజేయవచ్చని ఆయన సూచించారు. నవంబర్ 11న



ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని సీఈఓ విజ్ఞప్తి చేశారు.

**జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో సెలవు :** రేపు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో కలెక్టర్ సెలవు ప్రకటించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు, కాలేజీలకు, ఆఫీసులకు, ఐటీ ఆఫీసులకు సెలవు ప్రకటించారు. 14న కౌంటింగ్ జరగనుండగా.. ఆ ఏరియాలో సెలవు ఇవ్వాలని అధికారులకు కలెక్టర్ హరిచందన ఆదేశాలు జారీ చేశారు.

**జూబ్లీహిల్స్ పోలింగ్‌పై డ్రోన్‌లతో నిఘా..**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేయనున్నారు ఎన్నికల అధికారులు. మొదటిసారిగా ఎన్నికల నిర్వహణలో డ్రోన్లు ఉపయోగిస్తున్నారు. 139 పోలింగ్ లొకేషన్స్ లో 139 డ్రోన్లను అధికారులు వినియోగించనున్నారు. డ్రోన్ల నుంచి వచ్చే ఫీడ్ లైవ్ స్ట్రీమింగ్ ద్వారా కంట్రోల్ రూమ్ కి అనుసంధానిస్తారు. యూసఫ్ గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో సీఈవో సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ డ్రోన్ల ను పరిశీలించారు.

# అందెశ్రీ అస్తమయం

మొదటిపేజీ తరువాయి

కుటుంబంలో అందె ఎల్లయ్యగా జన్మించారు. చిన్నప్పటినుంచే ఆర్థిక ఇబ్బందులు, విద్యావకాశాల లేమి ఆయనను పాఠశాల నుండి దూరం చేశాయి. చదువుకోలేకపోయినా 'జీవితం'నే ఆయనకు గురువయ్యింది. పల్లె బాటల్లో, పొలాల్లో, పల్లెల పండుగల్లో వినిపించే పాటలే ఆయనకు స్ఫూర్తి. ఆ స్వరాలే తరువాత గేయాలుగా మారాయి. ప్రకృతి, మనిషి, వేదన, బతుకమ్మ వంటి భావాలు ఆయన కలంలో పద్యాలుగా మలచబడ్డాయి.

**ప్రజలే పుస్తకం... బతుకే విశ్వవిద్యాలయం**

అందెశ్రీకి ఎలాంటి విద్యాసర్టిఫికేట్ లేకపోయినా, ఆయన జీవితమే ఒక పాఠ్యగ్రంథం. చదువురాని ఆయనకు తెలుగంతా తెలుసు. అభ్యాసం లేకపోయినా, అక్షరాలను జీవిత అనుభవాలుగా మలచగల అద్భుత ప్రతిభ ఆయన సొంతం. తెలంగాణ భాషా శైలిలో, పల్లె పదజాలంలో ఆయన కవిత్వం రసాయనం. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' అంటూ అందరినీ కదిలించారు.

**జయ జయహే తెలంగాణ – చరిత్రను మలిచిన గీతం**

2003లో రచించిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' గీతం తెలంగాణ ఉద్యమానికి చిహ్నంగా మారింది. ఈ గీతం పల్లె నుంచి పట్టణం వరకు, విద్యార్థి నుంచి రైతు వరకు అందరి గొంతులో మార్మోగింది. ఉద్యమ వేళలో ఇది తెలంగాణ భావజాలానికి ప్రాణం పోసింది. రేవంత్ ప్రభుత్వం ఈ పాటను రాష్ట్రగీతంగా ప్రకటించింది. తెలంగాణ భూభాగం సాధనలో అందెశ్రీ పేరు స్వర్ణాక్షరాలతో చెక్కబడింది. తెలంగాణ మట్టి వాసనతో, పల్లె మనుషుల మాటలతో ఆయన రాసిన పాటలు సినిమాల్లోనూ సుస్థిరమైన ముద్ర వేశాయి. 2006లో "గంగ" సినిమాలో ఆయన రాసిన పాటకు నంది అవార్డు లభించింది.



**అయితే ఆయనకు పురస్కారాల కంటే ప్రజల ప్రేమే ముఖ్యమని అనేవారు.**

**అవార్డులు, గౌరవాలు**

నంది అవార్డు (2006) - గంగ చిత్రంలోని పాటకు
కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్
దాశరథి సాహితీ పురస్కారం (2015)
జానకమ్మ జాతీయ పురస్కారం (2022)
దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం (2024)
లోక నాయక్ అవార్డు
2025 జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో రూ. కోటి పురస్కారం

ఈ గుర్తింపులు ఆయన కవిత్వం, సృజనాత్మకతకు బంగారు పుటలు జోడించాయి.

**తెలంగాణ ఉద్యమంలో కవి**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో అందెశ్రీ పాత్ర అసాధారణం. కవిగా మాత్రమే కాదు, ఒక సైనికుడిలా ఆయన ఉద్యమకారుల పక్కన నిలిచారు. పల్లె పల్లె తిరిగి ప్రజల్లో అవగాహన కల్పించారు.తన కవిత్వం ద్వారా తెలంగాణ ఆత్మను మేల్కొలిపారు. ఆయన రాసిన ప్రతి పాదం ఉద్యమ నినాదంగా మారింది. "జయ జయహే తెలంగాణ" గీతం వినిపించగానే ఉద్యమకారుల కళ్లలో కాంతి వెలిగేది.ఆ గీతం తెలంగాణ భావజాలానికి చిహ్నం అయ్యింది.

**చదువులేని కవి... భావజాలపు మేధావి**

చదువులేనని ఆయన ఎప్పుడూ సిగ్గుపడలేదు. అదే తన బలమని గర్వపడ్డాడు. "నేను పుస్తకాలు చదవలేదు, కానీ మనిషిని చదివాను" అనే ఆయన మాటలు ఇప్పటికీ ప్రాచుర్యం పొందుతున్నాయి. ప్రజల పట్ల ఆయనకు ఉన్న దయ, భావుకత, మనసు మృదుత్వం ఆయన ప్రతి పద్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. కొన్నాళ్లుగా రక్తపోటు, మధుమేహం సమస్యలతో బాధపడుతున్నారు. డాక్టర్లు సూచించిన మందులు తరచుగా వదిలేస్తారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ నిర్లక్ష్యమే చివరకు ప్రాణాంతకమైంది. ఉదయం అకస్మాత్తుగా అస్వస్థతగా ఫీలవడంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఆయనను మరణించినట్లు ప్రకటించారు.

**ప్రముఖుల సంతాపం**

"తెలంగాణ రాష్ట్ర గీతానికి జీవం పోసిన కవి అందెశ్రీ ఇక లేరన్న వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన సాహిత్యం తెలంగాణ ఆత్మగీతంలా మిగిలిపోతుంది."

**- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

"తెలంగాణ ఉద్యమానికి అందెశ్రీ గొప్ప ఆత్మను ఇచ్చారు. ఆయన పాటల్లోనే ఉద్యమం సాగింది."

**- మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు**

"తెలంగాణ బతుకమ్మ పాటలకి, ఉద్యమ గీతాలకు మూలమైన వ్యక్తి ఇక లేరు. తెలంగాణ సాహిత్యం ఒక పెద్ద దిక్కు కోల్పోయింది."

**- మాజీ మంత్రి హరీశ్‌రావు**

# ఎయిర్‌పోర్టు తరహాలో సికింద్రాబాద్ స్టేషన్

మొదటిపేజీ తరువాయి

దృష్టిలో ఉంచుకున్న మహత్తర ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు.

**భారీ ప్రాజెక్ట్ సౌకర్యాల వర్షం**

ఈ ప్రాజెక్ట్ కింద స్టేషన్ భవనం మొత్తం 1.65 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం రోజుకు సగటున 1.97 లక్షల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా రాకపోకలు సాగిస్తుండగా, నూతన సదుపాయాలతో అది 2.70 లక్షల మంది వరకు విస్తరించనున్నట్లు వివరించారు. అభివృద్ధి పనుల్లో రైల్వే అధికారులు ఎదుర్కొంటున్న సవాళ్లను మంత్రి వివరించారు "ప్రతిరోజూ నడుస్తున్న రైళ్లు, ప్రయాణికుల రాకపోకలు ఆగకుండా పనులు చేయాల్సి రావడం వల్లే ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకమైనది. అయినా కూడా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు వేగంగా సాగుతున్నాయి" అని చెప్పారు.

నూతన స్టేషన్‌లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, రెండు ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్లు, అలాగే 5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్** ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదుపాయాలు పూర్తి స్థాయిలో పర్యావరణహితంగా ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అదనంగా, స్టేషన్ భవనం లోపల




ఆధునిక వేటింగ్ హాలులు, విస్తృత పార్కింగ్ స్థలాలు, ఫుడ్‌కోర్టులు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, హైటెక్ కంట్రోల్ రూమ్ వంటి సదుపాయాలు ఉండనున్నాయి.

**మెట్రో అనుసంధానం**

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను హైదరాబాద్ మెట్రో రైలుతో అనుసంధానం చేయడం ఈ ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన అంశం. ప్రస్తుతం రైలు ప్రయాణం, మెట్రో మార్గం, బస్సు, కేబ్ సర్వీసుల మధ్య సమన్వయం లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతుండగా, ఈ అనుసంధానం పూర్తయితే ఒకే కేంద్రంగా అన్ని రవాణా సౌకర్యాలు లభిస్తాయి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, "సికింద్రాబాద్ స్టేషన్ పునర్నిర్మాణం పూర్తయితే, హైదరాబాద్ నగరానికి ఇది ఒక రవాణా హబ్‌గా నిలుస్తుంది. రైలు, మెట్రో, బస్సు, టాక్సీ – అన్నీ ఒకే వేదికలో కలుస్తాయి. ప్రజల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, వేగంగా మారుతుంది" అని తెలిపారు.

**మోడల్ స్టేషన్‌గా నిలిచే లక్ష్యం**

దేశవ్యాప్తంగా రైల్వే ఆధునికీకరణ ప్రాజెక్టుల లో సికింద్రాబాద్ స్టేషన్ ఒక మోడల్ ప్రాజెక్ట్‌గా గుర్తింపు పొందుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యాలతో పాటు భద్రత, పర్యావరణ పరిరక్షణ, శక్తి ఆదా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సౌర విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చు తగ్గించడమే కాక, కార్బన్ ఉద్గారాలను కూడా నియంత్రించాలనే లక్ష్యం పెట్టుకున్నారు.

**మోదీ చేతుల మీదుగా ప్రారంభం**

కేంద్ర మంత్రి ప్రకారం, వచ్చే ఏడాది డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆధునిక సికింద్రాబాద్ స్టేషన్ ప్రారంభం కానుంది. అప్పటికి అన్ని పనులు పూర్తయ్యేలా లక్ష్యాన్ని నిర్ణయించామని తెలిపారు. "సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రూపాంతరం పొందిన రోజే హైదరాబాద్ నగర రవాణా చరిత్రలో కొత్త అధ్యాయం మొదలవుతుంది. ఇది కేవలం ఒక రైల్వే స్టేషన్ కాదు... తెలంగాణ ప్రగతికి ప్రతీకగా నిలుస్తుంది," అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.





# ధాన్యం కొనుగోళ్లలో కొత్త మైలు రాయి

- రికార్డ్ స్థాయిలో ధాన్యం సేకరణ
- తప్పుడు ప్రచారం అరికట్టాలి
- చెల్లింపులు 48 గంటల్లోనే పూర్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

రాష్ట్రం ధాన్యం కొనుగోళ్లలో కొత్త మైలురాయిని అధిగమించిందని, ఖరీఫ్ సీజన్‌లో 8.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత సంవత్సరం ఇదే సమయంలో కొనుగోలు చేసిన 3.94 లక్షల మెట్రిక్ టన్నుల కంటే రెండింతలు ఎక్కువ సేకరణ చేసినట్లు వెల్లడించారు.సోమవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు , పౌర సరఫరాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు ప్రచారాన్ని అరికట్టాలని ఆదేశించారు. రాష్ట్రం ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో రికార్డు నెలకొల్పిందని తెలిపారు.

దేశంలో తొలిసారిగా ఒక రాష్ట్ర ప్రభుత్వం ఒకే ఖరీఫ్ సీజన్‌లో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించుకుందన్నారు. ఇది తెలంగాణ వ్యవసాయ రంగ బలాన్ని, రైతుల పట్ల మా ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఇప్పటి వరకు 3.95 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు, 4.59 లక్షల మెట్రిక్ టన్నుల పెద్ద ధాన్యం కొనుగోలు చేసినట్లు, కేంద్రాలకు ధాన్యం అమ్మిన రైతుల సంఖ్య గత సంవత్సరం 55,493 మందిగా ఉండగా, ఈ ఏడాది 1,21,960 మందికి చేరిందని చెప్పారు.మొత్తం ధాన్యం కొనుగోలు విలువ రూ. 2,041.44 కోట్లు కాగా, ఇది గత సంవత్సరం రూ. 915.05 కోట్లతో పోలిస్తే రెట్టింపు ఉందన్నారు. ఇందులో రూ. 832.90 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించగా, మిగిలిన రూ. 1,208.54 కోట్లు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్) ద్వారా నమోదు తర్వాత 48 గంటల్లో చెల్లించనున్నట్లు తెలిపారు. సన్నాల బోనస్ గత సంవత్సరం రూ. 43.02 కోట్ల నుండి ఈ సంవత్సరం రూ. 197.73 కోట్లకు పెరిగిందని, అందులో రూ. 35.72 కోట్లు ఇప్పటి వరకు చెల్లించామన్నారు. రైతులకు సమయానికి చెల్లింపులు చేయడమే కాకుండా, తగిన నిల్వలు, రవాణా సదుపాయాలు కల్పించి, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.

మొంథో తుఫాన్ నుండి రైతులు కొంతవరకు కోలుకుంటున్న సమయంలోనే మరో వాతావరణ వ్యవస్థ ఏర్పడిందని పేర్కొన్నారు. అన్ని జిల్లాలు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, నిల్వ ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా రక్షించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో తార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు ప్రతిరోజు వాతావరణ హెచ్చరికలు అందజేయాలని చెప్పారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని తక్షణమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి, బాయిల్డ్ రైస్ కోటా కేటాయింపుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అదనంగా తగిన గోదాంలు, స్థానిక హమాలీ సిబ్బందిని సమకూర్చి కొనుగోలు ప్రక్రియ అంతరాయం లేకుండా కొనసాగించాలని ఆదేశించారు.

**తుఫాన్ కారణంగా 1.10 లక్షల ఎకరాల్లో పంట నష్టం : తుమ్మల**

తుఫాన్ కారణంగా సుమారు 1.10 లక్షల ఎకరాలలో ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొందించిన పంటనష్టం నివేదికను కేంద్రానికి పంపామని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కొనుగోళ్లు సజావుగా సాగేందుకు ధాన్య తేమ శాతం నిబంధనలను సడలించమని కేంద్రాన్ని అభ్యర్థించామని చెప్పారు.తాము కేంద్రంతో చర్చలు కొనసాగిస్తామన్నారు.వాతావరణ ప్రభావంతో నష్టపోయిన పంటలు రైతులకు నష్టం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.



# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**దౌల్తాబాద్, నవంబర్ 10 (సిద్దిపేట పవర్)**

కుటుంబ కలహాలు భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన దౌల్తాబాద్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం, సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గొల్ల బిక్షపతి (50) కుటుంబ వివాదాల నేపథ్యంలో ఇంటి సమీపంలోని చింత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# ముమ్మరంగా తమ్మిడికుంట పునరుద్ధరణ

- పరిశీలించిన హైడ్రా కమిషనర్
- ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా
- ఆక్రమణలతో పాటు పూడికను తొలగించిన హైడ్రా
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని రంగనాథ్ సూచన

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**



ఐటీ కారిడార్ మాదాపూర్‌లో మరో ఆకర్షణ ప్రజలకు అందుబాటులోకి రానుంది. మురుగు నీటిని, దుర్గంధాన్ని వదిలించుకుని సహజ సరస్సుగా తమ్మిడికుంట రూపుదిద్దుకుంటోంది. ముళ్ల పొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు సహజత్వాన్ని హైడ్రా అందిస్తోంది. చెరువులో ఆక్రమణలతో పాటు పూడికను తొలగించి విస్తీర్ణం పెంచడంతో ఇప్పుడు ఆ పరిసరాలు ఎంతో విశాలంగా మారాయి.ఈ అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మాణంతో పాటు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల నిర్మాణ పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. ఐటీ కారిడార్లో ఉన్న ఈ చెరువును ఒక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా ఇన్‌లెట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. 14 ఎకరాల చెరువును 29 ఎకరాలకు విస్తరించడం జరిగిందని, అదే విస్తీర్ణంలో నీరు నిలిచేలా చెరువు అభివృద్ధి చేయాలని సూచించారు.

**సందర్శకులు సేదతీరేలా**

దేశం నలుమూలల నుంచి వచ్చిన ఐటీ నిపుణులు వచ్చే ప్రాంతం కావడంతో పాటు అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రాంతం కూడా ఇదేనని, ఇలాంటి చోట ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని హైడ్రా కమిషనర్ సూచించారు. తమ్మిడికుంటలో స్వచ్ఛమైన నీరు ఎంత ముఖ్యమో ఆ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రమైన వాతావరణంలో ఉండటానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టూ దాదాపు 2 కిలోమీటర్ల మేర ఉన్న బండ్‌పై ప్రాణవాయువు అందించడంతో పాటు చల్లటి నీడనిచ్చే చెట్లు పెంచాలన్నారు. చెరువు ప్రధాన ప్రవేశమార్గంలో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. అన్ని వయస్సుల వారూ తమ్మిడికుంట పరిసరాలకు వచ్చి సేద తీరే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లలకు ఆటవిడుపుగా క్రీడా స్థలాలను తీర్చిదిద్దాలని రంగనాథ్ సూచించారు. వృద్ధులు కూర్చునేందుకు వీలుగా చుట్టూ సిమెంట్, రాతి కుర్చీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఓపెన్ జిమ్‌లు, కొద్దిమంది కూర్చొని ప్రశాంతంగా మాట్లాడుకోడానికి వీలుగా గుమ్మటాలు ఏర్పాటు చేయాలన్నారు.

# ఉలిక్కిపడ్డ దేశ రాజధాని

- ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు
- 13 మంది మృతి.. 21 మందికి తీవ్ర గాయాలు
- సిగ్నల్ దగ్గర ఆగిన కారులో ఒక్కసారిగా పేలుడు
- సమీపంలోని వాహనాలు ధ్వంసం.. మంటలు
- ఉగ్ర కుట్ర కోణంలోనూ పోలీసుల దర్యాప్తు
- ఢిల్లీ, ముంబై సహా ప్రధాన నగరాల్లో హై అలర్ట్
- ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ విచారం

**న్యూఢిల్లీ, సిద్దిపేట పవర్ :**



దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగిన కారు ఒక్కసారిగా పేలింది. ఈ ఘటనలో 10 మంది చనిపోగా 24 మంది గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. చారిత్రక ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నెంబర్ 1 సమీపంలో ఈ ఘటన జరిగింది. పేలుడు కారణంగా కారులో మంటలు చెలరేగాయి. మరో నాలుగు వాహనాలు దెబ్బతిని, మంటలు వ్యాపించాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయాందోళన వాతావరణం నెలకొన్నది. పేలుడు నేపథ్యంలో ఢిల్లీలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఢిల్లీ పోలీసులు, ఫైర్ బ్రిగేడ్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పూర్తిగా తమ అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా నగరమంతా హై అలర్ట్ ప్రకటించారు. ఈ పేలుడు జరగడానికి కేవలం కొన్ని గంటల ముందు, ఢిల్లీ పోలీసులు, జమ్మూ పోలీసులు సంయుక్తంగా అంతర్రాష్ట్ర ఉగ్రవాద మాడ్యూల్‌ను ఛేదించి, సుమారు 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ సామగ్రితో వందలాది శక్తిమంతమైన ఐఈడీలు తయారు చేసి ఢిల్లీలో దాడులు చేయాలనే కుట్ర ఉన్నదని అధికారులు పేర్కొన్నారు. అత్యంత సున్నిత ప్రాంతంలో, ఉగ్రవాద కుట్ర భగ్నం అయిన వెంటనే పేలుడు జరగడంతో ఈ ఘటనపై కుట్ర కోణం ఉందా లేదా పేలుడుకు కారులోని సీఎన్‌జీ కిట్‌లో సాంకేతిక లోపం కారణమైందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీ స్పెషల్ సెల్, ఫోరెన్సిక్ బృందాలు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నాయి.

**మోదీ, అమిత్ షా ఆరా**

పేలుడు ఘటనపై ప్రధాని మోదీ స్పందించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ, క్రైమ్ బ్రాంచ్, ఎన్ఐఏ బృందాలు రంగంలోకి దిగాయని తెలిపారు. ఘటన జరిగిన పది నిమిషాల్లోనే అన్ని బృందాలు అక్కడకు చేరుకున్నాయని, సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతున్నదని, ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నట్టు వివరించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఈ ఘటన తనను తీవ్రం కలచి వేసిందని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**ఢిల్లీ సమీపంలో పేలుడు పదార్థాల పట్టివేత**

మరోవైపు, కారులో పేలుడు జరగడానికి కొన్ని గంటల ముందే పోలీసులు పెద్ద మొత్తంలో ఢిల్లీ సమీపంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. కశ్మీర్ పోలీసులు అందించిన సమాచారంతో దాడులు జరిపి ఓ ఇంటి నుంచి 350 కిలోల అమ్మోనియం నైట్రేట్, రైఫిల్, 20 టైమర్లను సీజ్ చేశారు. దాంతోపాటు 3 బుల్లెట్ మ్యాగజైన్లు, పిస్టల్, వాకీటాకీని కూడా స్వాధీనం చేసుకున్నారు. గత నెల 27న శ్రీనగర్‌లో ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మహ్మద్‌కు అనుకూలంగా పోస్టర్లు వెలిశాయి. దీనిపై విచారణ జరిపిన స్థానిక పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా డాక్టర్ ఆదిల్ అహమద్ వీటిని అతికించినట్టుగా నిర్ధారించుకున్నారు. గతంలో అనంత్ నాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పని చేసిన ఆదిల్ ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లోని ఓ హాస్పిటల్‌లో పని చేస్తున్నట్టుగా నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో ఆదిల్‌ను అదుపులోకి తీసుకుని అతని లాకర్ నుంచి ఓ రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆదిల్ వెల్లడించిన వివరాల మేరకు ఫరీదాబాద్ లోని ఓ ఇంటి నుంచి అమ్మోనియం నైట్రేట్ తోపాటు పిస్టళ్లు, బుల్లెట్లు, టైమర్లను స్వాధీనం చేసుకున్నారు.



# హైదరాబాద్ సిటీలో నాకా బందీ!

- దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు ఎఫెక్ట్

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించడంతో దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో పార్క్ చేసిన కారులో ఈ పేలుడు సంభవించింది. ఇది హైగ్రేడ్ ఎక్స్‌ప్లోజివ్‌తో ఉపయోగించిన చర్యగా అనుమానిస్తున్నారు. ఎర్రకోట గేట్ నంబర్ 1 దగ్గర జరిగిన ఈ పేలుడు ధాటికి ఐదు కార్లు ధ్వంసమవగా, పేలుడు వల్ల ఇతర వాహనాలకు మంటలు అంటుకున్నాయి. 13 మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో క్షతగాత్రులు అయ్యారు. బాధితులకు ఎల్ఎన్ జేపీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఏడు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పి వేశారు. ఢిల్లీలో పేలుడు ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ముంబై, హైదరాబాద్ సహా అన్ని ప్రధాన నగరాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. భద్రతను కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఘటనాస్థలికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ బృందాలు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాంబు స్క్వాడ్ బృందాలు కూడా ఘటన స్థలాన్ని పరిశీలించాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సిటీలో పోలీసులు భద్రతను పెంచారు. నగరంలో 'నాకా బందీ' (అన్ని వైపులా దిగ్బంధనం) ఏర్పాటు చేసి రద్దీ ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ నగర ప్రజలకు సూచించారు.



# అమ్మకానికి రాజీవ్ స్వగృహ ప్లాట్లు

- ఈ నెల 17, 18న బహిరంగ వేలం
- 15 వరకు దరఖాస్తుల స్వీకరణ

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

హైదరాబాద్‌కు సమీపంలోని తొర్రూర్, బహాదూర్‌పల్లి, కుర్మల్‌గూడ ప్రాంతాల్లోని లేఔట్లలో ఇండ్ల నిర్మాణానికి అనువైన 163 ఖాళీ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్టు తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతం ప్రకటించారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)కు అతి చేరువలోని తొర్రూర్ ప్రాంతంలో 200 నుంచి 500 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన 125 ప్లాట్లు, కుర్మల్‌గూడలో 200300 చదరపు గజాల విస్తీర్ణంలోని 25 ప్లాట్లు, బహదూర్‌పల్లిలో 2001,000 గజాల్లోని 13 ప్లాట్ల విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వెల్లడించారు. ఈ లేఔట్లలో ఇప్పటికే మౌలిక వసతుల కల్పన పూర్తయిందని, ప్లాట్లపై ఎలాంటి వివాదాలు లేవని తెలిపారు. ఈ నెల 17, 18న పెద్ద అంబర్‌పేటలోని అవికా కన్వెన్షన్‌లో ప్లాట్ల వేలం జరుగుతుందని, ఆసక్తి ఉన్న కొనుగోలుదారులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

## నిరుపేద కుటుంబానికి బియ్యం అందజేసిన పొన్నబోయిన శ్రీనివాస్ యాదవ్

**దుబ్బాక సిద్దిపేట పవర్ 10 నవంబర్ :**
దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ 3వ వార్డుకు చెందిన రామోజీ ప్రభాకర్ మాతృ మూర్తి రామోజీ కిష్టవ్వ మరణించిన విషయంను పొన్నబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలుసుకొని బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబకు సహాయం చేయడం లోనే అసలైన ఆనందం ఉంటుందని పేర్కొన్నారు. పేదలకు అవసరమైన సహాయం చేసేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగ్ల లక్షణ్, తదితరులున్నారు.



## గాంధీ మెడికల్ కాలేజీకి రాఘవరావు పార్ధివ దేహం అప్పగింత

**సికింద్రాబాద్, నవంబర్ 10 ( సిద్దిపేట పవర్ ) :**



వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్(రిటైర్డ్) ఈ. రాఘవరావు (91)వృద్ధాప్య సమస్యల తో ఆదివారం సాయంత్రం అత్తాపూర్ లో కన్నుమూశారు. గతంలో ఆయన చేసిన డిక్లరేషన్ ప్రకారం ఆయన పార్ధివ దేహాన్ని కుటుంబసభ్యులు సోమవారం గాంధీ మెడికల్ కాలేజీకి తీసుకువచ్చి, అనాటమీ డిపార్ట్ మెంట్ కు అప్పగించారు. వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం రాఘవ రావు పార్థివ దేహాన్ని డొనేట్ చేసినట్లు ఫ్యామిలీ మెంబర్స్ తెలిపారు. మెదక్ జిల్లా కూర్మపల్లికి చెందిన రాఘవరావు 1993 లో వ్యవసాయ శాఖలో అడిషనల్ డైరెక్టర్ గా పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. వైద్య వృత్తి ఎంతో గొప్పదని, వైద్యులు అందరికి చేసే సేవలు అమూల్యమైనవని అంటూ , వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం బాడీ డోనేట్ ఇవ్వడం సముచితం అంటూ ఆయన గతంలో బాడీ డొనెట్ కై సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చినట్లు కుటుంబసభ్యులు విజయ్ కృష్ణ తెలిపారు. రాఘవరావుకు భార్య పద్మ, కూతుర్లు మాధురి,శృతి, కుమారుడు వినోద్ ఉన్నారు. ప్రిన్సిపాల్ డా.ఇందిరా, అనాటమీ ప్రొఫెసర్ సుధాకర్ బాబు,అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సంగీత, ఎంపీహెచ్ఓ వేణుగోపాల్ గౌడ్, వైద్య విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.







## దళారులను నమ్మి రైతులు పత్తి విక్రయించవద్దు

- ప్రభుత్వ సీసీఐ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి
- అధికారులు సిపివో ప్రసాద్ రావు శ్రీధర్ జాన్ వేస్లీ

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**
జగదేవపూర్ మండలం అలిరాజాపేట గ్రామంలోని విశ్వతేజ కాటన్ ఇండస్ట్రీ లో ప్రొపరేటర్ రమణ రావు ఆధ్వర్యంలో ప్రారంభ కార్యక్రమనికి అధికారులు సిపివో ప్రసాద్ రావు,శ్రీధర్ మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వేస్లీ చేతుల మిదుగా పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను వినియోగించు కోవాలి. అదేవిధంగా అన్నదాతలు పత్తి అరుగల్ల పండించిన కష్టాన్ని దళారులకు విక్రయించి మోసపోవదని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రూ. 8,110/ రూపాయలకు అన్నదాతలు అమ్ముకోవాలని తేమ శాతం 8నుండి 12 శాతం ఉండే విధంగా రైతులు తీసుకురావాలని పేర్కొన్నారు. పత్తి నిర్వాహకులు రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ కవి అందెశ్రీ మరణం సాహితి లోకానికి తీరనిలోటు

- శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించిన కవి గాయకులు పిన్నింటి రత్నం

ప్రజా వాగ్గేయకారులు లోక కవి తెలంగాణ రాష్ట్ర గీత రచయిత డాక్టర్ అందెశ్రీ మరణించడం సాహితీ లోకానికి తెలంగాణ ప్రజలకు తీరని లోటని తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం ఆవేదన వ్యక్తం చేశారు, కొమురవెల్లి మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడుతూ అందెశ్రీ గారు మారుమూల రేబర్తి గ్రామంలో మట్టి బిడ్డగా పుట్టి కూలీనాలీ పనులు చేసుకుంటూ పశువుల కాపరిగా తన జీవితం ఆరంభించి మనిషి జీవన ప్రమాణాలపై తెలంగాణకు జరుగుతున్నటువంటి దోపిడీపై తన గళాన్ని కలాన్ని పదును పెట్టి తెలంగాణ మలిదశ ఉద్యమంలో జన జాతరలో మన గీతం జయకేతనం ఎగరాలి, మాయమైపోతున్నడమ్మ మనిషన్నవాడు, పల్లె నీకు వందనాలమ్మ మముగన్నా తల్లి, చూడ చక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి అనేక పాటలు రాసి జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం అనే పాట రాష్ట్ర గీతంగా అందించి తెలంగాణ ప్రజల గుండెల్లోగుండెల్లో చిరస్థాయిగా నిలిచారని నేటి కవులకు కళాకారులకు మార్గం నిర్దేశకుడని కొనియాడారు, ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కర్త మంకాల సతీష్, బావండ్లపల్లి చంద్రం, చంద్ర శ్రీకాంత్,ముత్యం పర్శరాములు, ఓరుగంటి బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఐదు ఏండ్లుగా ఆయనకు హైపర్ టెన్షన్...

- ఆరోగ్యం విషయంలో కొంత నిర్లక్ష్యం..
- నెల నుంచి బీపీ టాబ్లెట్స్ వేసుకోవడం లేదు..
- అందెశ్రీ మృతిపై గాంధీ డాక్టర్లు..

**సికింద్రాబాద్, నవంబర్ 10 ( సిద్దిపేట పవర్ ) :**



ప్రముఖ కవి అందెశ్రీ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఉదయం 7.20 గంటలకు అంబులెన్స్ లో ఇంటినుంచి గాంధీ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డుకు తీసుకురాగా, వెంటనే అడ్మిట్ చేసుకున్న డాక్టర్లు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే అప్పటికే అందెశ్రీ మరణించినట్లు తెలిపిన వైద్యులు బ్రాట్ డెడ్ గా ప్రకటిం చారు. అనంతరం గాంధీ ఆసుపత్రి జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ ప్రొఫెసర్ సునీల్ కుమార్ ఈసందర్భంగా మీడియాతో మాట్లాడారు. అందెశ్రీ గుండెపోటుతో చనిపోయాడని, ఆయనకు గత ఐదు ఏండ్లుగా హైపర్ టెన్షన్ (బీపీ) ఉందన్నారు. అయితే గత నెల రోజుల నుంచి బీపీ మందులు వాడటం లేదని ఫ్యామిలీ మెంబర్స్ చెప్పినట్లు పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ఆయాసం ఉందని, చెస్ట్ డిస్ కంఫర్టబుల్ గా ఉందని కుటుంబసభ్యులకు చెప్పిన అందెశ్రీ ఆసుపత్రికి వెళ్ళలేదన్నారు. ఆరోగ్యం విషయంలో ఆయన కొంత నెగ్లెట్ చేశాడన్నారు. ఆదివారం రాత్రి భోజనం చేసి మాములుగా నిద్రపోయిన అందెశ్రీని ఉదయం 6.20 గంటల ప్రాంతంలో బాత్ రూమ్ వద్ద కింద పడిపోయి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గాంధీకి తెచ్చారు. అందెశ్రీని పరీక్షించిన డాక్టర్ సింధూర, ఆర్ఓంవో అప్పటికే చనిపోయినట్లు ప్రకటించారు. అప్పటికే అందెశ్రీ చనిపోయి దాదాపు 5గంటలు అయి ఉండవచ్చని డాక్టర్లు భావిస్తున్నారు. కాగా గాంధీనుంచి ప్రత్యేక అంబులెన్స్ లో లాలాపేట వినోభానగర్ లోని ఆయన నివాసానికి పార్థివ దేహాన్ని తరలించారు. అందెశ్రీ మృతదేహం తరలింపు ఏర్పాట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వాణి పర్యవేక్షించారు.



## యువజన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**చేర్యాల, నవంబర్ 10 (సిద్దిపేట పవర్)**
చేర్యాల మండల యూత్ ఉపాధ్యక్షులు తాండ్ర ఆంజనేయులు జన్మదినం సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంజనేయులు భవిష్యత్తులో రాజకీయంగా ఎదగాలని, ఇపుడు కూడా జూబ్లిహిల్స్ లో బి.ఆర్.ఎస్. పార్టీ గెలుపు కోసం కష్టపడ్డాడు అని తెలిపారు..జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కి ఆంజనేయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, జన్మదినం సందర్భంగా తనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.. కార్యక్రమంలో మండల బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు పాల్గొన్నారు..



## 17 న మల్లుపల్లిలో అమరుల స్మారక స్థూప నిర్మాణ కార్యక్రమం

- అమరవీరుల స్మారక కమిటీ
- జిల్లా కన్వీనర్ శివరాజు, కో కన్వీనర్ మేకల రాములు

**సిద్దిపేట, నవంబర్ 17:**
ఉమ్మడి మెదక్ జిల్లా అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 17న మిడిదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించబడుతున్న అమరుల స్మారక స్థూపం నిర్మాణ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థి సంఘాలు, ఉద్యమకారులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా స్మారక కమిటీ పిలుపునిచ్చింది. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో జిల్లా కన్వీనర్ శివరాజు, కో కన్వీనర్ మేకల రాములు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై పోరాడి ప్రాణాలు అర్పించిన కామ్రేడ్ సంజీవ్, జాన్సన్, అప్సర్, కనకయ్య లాంటి అమరుల త్యాగాలను నేటి తరం ఎలిగెత్తి చాటాలి. బీడీ కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, సారా వ్యతిరేక ఉద్యమాలు, సబ్బండ వర్గాల హక్కుల కోసం వీరు చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. ఈ అమరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి సామాజిక బాధ్యత" అని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రజల కష్టాలు, పేదరికం, దోపిడీ, అణచివేత పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిన వీరి త్యాగాలను స్మరించుకుంటూ స్మారక స్థూప నిర్మాణ ప్రారంభోత్సవంలో పాల్గొని నివాళులు అర్పించాలని కమిటీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ తిరుపతి రెడ్డి, షాదుల్లా, శారద, పృథ్వీరాజ్, అజయ్ కుమార్, ఎల్లం, సాయికుమార్, యాదగిరి తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## నవంబర్ 15న కామారెడ్డిలో జరిగే బిసి ఆక్రోష సభ కరపత్ర ఆవిష్కరణ...

42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి మరియు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీల ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే బీసీ ఆక్రోశ సభ కరపత్ర ఆవిష్కరణ స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ నాయకులు మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించి భారత రాజ్యాంగంలో తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చే ప్రక్రియలో నిజాయితీ లేకుండా తప్పుడు జీవో ల ద్వారా బీసీ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా మరియు బీసీ రిజర్వేషన్ల బిల్లును భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పెట్టం అని నిర్లక్ష్యంగా ప్రకటించిన కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరికి నిరసనగా మరియు ఈ రెండు పార్టీల మాయా క్రీడలను చూస్తూ మౌనంగా ఉండి బీసీలను నిర్లక్ష్యం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నవంబర్ 15వ తేదీన కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండున్నర కోట్ల మంది బీసీ ప్రజల ఆక్రోష సభని నిర్వహించడం జరుగుతున్నది. ఈ దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల సమస్య ఈ దేశ ప్రధాన సమస్య అనే నిజం తెలిసి కూడా అగ్ర కుల పాలక వర్గాలు ఆ విషయాన్ని పట్టించుకోకుండా బీసీలను నిరంతరం మభ్యపెడుతూ, మాయ చేస్తూ తమ ఓట్ల రాజకీయ పబ్బం గడుపుకుంటున్న బిజెపి, కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల దుర్మార్గాలకు చరమగీతం కామారెడ్డి వేదికగా ఆరంభం కానుందని అన్నారు. ఈ ఆక్రోశ సభ కి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సభని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహారాజ్, భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకులు చక్రధర్ గౌడ్, బీసీ నాయకులు శివ గౌడ్, BC,SC, STJAC నాయకులు రవిబాబు, డి బి రాజు, ప్రసన్న, చందు, DSU జిల్లా కన్వీనర్ యాదగిరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



## 2015లో జగదేవపూర్ లో జరిగిన దోపిడీ కేసులో నిందితునికి ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష

- నింధుతునికి రూ. 3000/- జరిమానా

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**
జగదేవపూర్ గ్రామంలో 2015లో జరిగిన దోపిడీ కేసులో నిందితుడైన కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన దుర్గయ్య కు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిన గజ్వేల్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ ఈ కేసు దర్యాప్తు చేసిన అప్పటి సీఐ సతీష్, నిందితునికి శిక్ష పడే విధంగా కృషిచేసిన ప్రస్తుత గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, జగదేవపూర్ ఎస్సై కృష్ణారెడ్డి, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ నరేష్ ను సిపి అభినందించారు.

# రిజర్వేషన్ ఖరారైనా.. నియామకం ఎన్నడో?

- ఊరిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ
- చైర్మన్ పీఠంపై ఆశలు పెంచుకున్న గిరిజనులు

**రామయంపేట, 10 (సిద్దిపేట పవర్) :**

మెదక్ జిల్లా రామయంపేట మండలం లోట్ మండలం లోరిజర్వేషన్లు ఖరారు అయినప్పటికీ నియామకం జరగకపోవడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం.. ప్రజలను ఊరుస్తుంది. అయితే ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠానికి ప్రభుత్వం ఎస్టీకి రిజర్వేషన్ ఖరారు చేసింది. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఎస్టీ వర్గాల్లో ఆశలు పెరిగాయి. రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ముగిసి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఈ స్థానానికి మార్కెట్ కమిటీ చైర్మన్ నియమించకపోవడంపై ప్రజల్లో బేదభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై నలుగురు గిరిజనులు పోటీపడుతున్నట్లు వినిపిస్తున్నాయి. చిన్న శంకరంపేట మండలం టి. మాదాపూర్ తొండ కు చెందిన అశోక్ నాయక్, కామవరం తండాకు చెందిన హళావత్ మోహన్ నాయక్, టీ. మాదాపూర్ తండాకు చెందిన సురేందర్ నాయక్ తో పాటు సంకాపూర్ తాండకు చెందిన రాజాసింగ్, నిజాంపేట మండలానికి చెందిన శ్రీను నాయక్, వినోద్ నాయక్ పదవిపై ఆశిస్తున్నట్లు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్వారా తెలిసిన విషయమే.. ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి 2024 జనవరి 12వ తేదీన ముగిసింది. ఈ పదవిపై ఆశవాహకులు అధికమవడంతో ఈ పదవి ఎవరికి దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది. రైతు ఉత్పత్తులు కొనేవారు కరువు. మార్కెట్ పాలకవర్గాలను ఏర్పాటుకు చేయకపోవడంతో రైతులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. రామాయంపేట మార్కెట్ కమిటీ పరిధిలో మొక్కజొన్న ఎక్కువ పండిస్తారు. పాలక మండలి లేకపోవడంతో పంటను కొనుగోలు చేసేవారు కరువయ్యారు. దీంతో అన్నదాతలు తక్కువ ధరలకు దళారులకు విక్రయించుకోవలసిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని వెంటనే భర్తీ చేసి మార్కెట్ కమిటీ చైర్మన్ నియమించి మేలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.




# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వనభోజనం మహోత్సవం

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి:**

జగదేవపూర్ ఆర్యవైశ్య మహాసభ పట్టణ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కుకునూరు పల్లి మండలం పిటి వెంకటాపూర్ గ్రామంలోని శివాలయంలో అట్టహాసంగా కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. గణపతి పూజ, బిల్వ వృక్షానికి పూజలు శివాలయంలో అభిషేకాలు,విశేష పూజలు నిర్వహించి ఆటపాటలతో సంతోషంగా ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా అందరూ ఆర్థిక వనభోజన మహోత్సవంలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి, మాట్లాడుతూ కార్తీక మాసంలో వనభోజనం అత్యంత పవిత్రమైనదని, కార్తీక వనభోజనాల వల్ల, అందరూ ఒకచోట చేరడం వల్ల అనురాగం ఆప్యాయత,స్నేహ భావం పెంపొందుతాయి అని ప్రతి ఒక్కరూ దైవభక్తి స్నేహ భావం కలిగి ఉండాలని, ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరి చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని, జగదేవపూర్ మండల పట్టణ ఆర్యవైశ్యులు అత్యంత చక్కగా మంచి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్, ఆర్యవైశ్య మహాసభ నాయకులు ఆంజనేయులు గజ్వేల్ కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, నాచారం దేవస్థానం వాసవి నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు కొమురవెల్లి శంకరయ్య, జగదేవపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుబ్బ శ్రీనివాసరావు, జగదేవపూర్ మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు చంద్ర శేఖర్, గంగిశెట్టి శ్రీనివాస్,అమర రాము, బుద్ధ సత్యం ,చిగుళ్లపల్లి వెంకటేశం, పెద్ది శ్రీనివాస్, అయిత బాలరాజ్, అమర శ్రీనివాస్,పోతుగంటి శ్రీనివాస్,పెద్ద ఎత్తున ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, నవంబర్ 10(సిద్దిపేట పవర్) :**

జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారము సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, సీ.సీ టీ.వీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. రిజిస్టర్ల ను పరిశీలించి సంతకాలు చేశారు. కలెక్టర్ గారితో పాటు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, తహసిల్దార్ లక్ష్మినారాయణ ,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ హోలి, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.



# 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

**చేగుంట, నవంబరు 10 (సిద్దిపేట పవర్) :**

చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన గర్భిణి స్త్రీ స్రవంతి కి సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. శంకరంపేట ఆర్ అంబులెన్స్ సిబ్బంది ఆమెను గజ్వేల్ హాస్పిటల్ కు తరలిస్తుండగా రుక్మాపూర్ శివారులో నొప్పులు ఎక్కువ అయ్యాయి గమనించిన అంబులెన్స్ టెక్నీషియన్ మంజుల అంబులెన్స్ లోనే ప్రసవం చేశారు. స్రవంతి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలు ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారు. తల్లి, శిశువును గజ్వేల్ అసుపత్రిలో వారిని చేర్చినట్లు ఆమె తెలిపారు.

# శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, నవరత్న క్రాప్‌సైన్స్ మధ్య అవగాహన ఒప్పందం

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో ఉద్యాన రంగంలో విద్యా, పరిశోధన, విస్తరణ కార్యకలాపాలను బలోపేతం చేసే దిశగా ఒక కీలకమైన వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరింది. సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ నవరత్న క్రాప్‌సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యన్ సి యస్ తో ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ మూడేళ్ల ఒప్పందం ద్వారా విద్యా నైపుణ్యాన్ని పారిశ్రామిక ఆవిష్కరణలతో అనుసంధానించి, విద్యార్థులకు మెరుగైన ఆచరణాత్మక శిక్షణ, పరిశోధన అవకాశాలను కల్పించడం ద్వారా రాష్ట్రంలో ఉద్యాన సుస్థిరతను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ భాగస్వామ్యం కింద, నవరత్న క్రాప్‌సైన్స్ సంస్థ, పోస్ట్‌గ్రాడ్యుయేట్ రీసెర్చ్ రీసెర్చ్ లేబరేటరీని పరిశోధన కొరకు అధికారికంగా గుర్తించారు. దీని ఫలితంగా, విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ డాక్టరల్ స్థాయి విద్యార్థులు తాము ఎంచుకున్న పరస్పర అంగీకార అంశాలపై యన్ సి యస్ అత్యాధునిక ప్రయోగశాలల్లోనే తమ పరిశోధన (థీసిస్) నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. దీంతో పాటు, అండర్ గ్రాడ్యుయేట్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు క్షేత్ర శిక్షణ, పరిశోధనా విద్యార్థులకు ఫెలోషిప్‌లు అధ్యాపకుల నైపుణ్యాన్ని పంచుకునేందుకు వీలుగా ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలను కూడా ఈ ఒప్పందం సులభతరం చేస్తుంది.ఇరు సంస్థలు కలిసి మొక్కల వ్యాధుల నిర్వహణకు బయోటెక్నలాజికల్ టూల్స్ అభివృద్ధి చేయడం, పంట రకాల జన్యుపరమైన మెరుగుదల, సుస్థిర వ్యవసాయ పద్ధతుల ఆప్టిమైజేషన్ నూతన ఉద్యాన రకాలను పరిచయం చేయడం వంటి కీలక రంగాలపై దృష్టి సారించనున్నాయి. ఇందుకోసం ఇరుపక్షాలు తమ ప్రయోగశాల సౌకర్యాలు, పరికరాలు, సాంకేతిక నైపుణ్యం, శాస్త్రీయ వనరులను పంచుకోనున్నాయి. ముఖ్యంగా నేల ఆరోగ్యం, మొక్కల పోషణ పంట కోత అనంతర సాంకేతికత పోస్టు హార్వెస్ట్ టెక్నాలజీ వంటి రంగాలలో ఉమ్మడి పరిశోధనలు జరగనున్నాయి. ఈ ఒప్పందం ద్వారా ఉత్పన్నమయ్యే మేధో సంపత్తి హక్కులపై ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ రైట్స్ ఇరు సంస్థలకు ఉమ్మడి యాజమాన్యం ఉంటుంది. ఉద్యాన రంగం రాష్ట్ర జీయస్ డీపీ కి సుమారు 5.16% తోడ్పాటునందిస్తున్న ప్రస్తుత తరుణంలో, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం తెలంగాణ ఉద్యాన అభివృద్ధికి గణనీయమైన ఊపునిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. భగవాన్ యన్ సి యస్ తరపున మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ మొహమ్మద్ అలీ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ డి లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డీన్ ఆఫ్ పిజి స్టడీస్ డాక్టర్ సురేష్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్ శ్రీనివాసన్, ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ విజయ, డాక్టర్ పి సునందిని డాక్టర్ జి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి ముస్లింలకు క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకుడు పాషా

**గజ్వేల్ , నవంబర్ 8 (సిద్దిపేట పవర్) :**

మైనారిటీలు అంటే కాంగ్రెస్ అని, కాంగ్రెస్ లేనిదే ముస్లింలు లేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం విడ్డురంగా ఉందని రేవంత్ రెడ్డి మైనార్టీల పట్ల చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని ముస్లింలకు క్షమాపణ చెప్పాలని బీఆరెస్ రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకుడు జుబేరు పాషా, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో బీఆరెస్ రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకుడు జుబేరు పాషా మీడియా సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మైనారిటీల పాత్ర కీలకమైందని కొనియాడారు. గత బీఆరెస్ హయాంలో హోమ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రిగా చేసి మైనారిటీలను గౌరవించ్చిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలకు ఒరిగిందేమి లేదని, గొప్పలు తప్ప ఎలాంటి పథకాలను మైనారిటీల కోసం అందించలేదన్నారు ఎంతో మంది సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఉండగా ఎలాంటి అనుభవం లేని అజారుదిన్ ను మంత్రిగా చేసిందని, కేవలం జూబ్లీహిల్స్ బై ఫోల్ లో మైనారిటీల మెప్పు కోసం ఆ పార్టీ యత్నిస్తుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ బై పోల్లో బీఆరెస్, మాగంటి సునీతా గెలుపు ఖాయం అని ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాజా విరాసద్ అలీ, సయ్యద్ యూసఫ్ ఉద్దీన్, మాజీ కోఆప్షన్లు ఇక్బాల్, పర్వేజ్ ఉమర్, గులాం, మాజీ ఎంపిటిసి రియాజ్, అహ్మద్, వాజిద్, జమీల్, అల్తాఫ్, బాబా, షేర్ అలీ, పాషా,టిఆర్ఎస్వి నవాజ్, జహంగీర్, అక్రమ్ తదితరులు ఉన్నారు.



# యూపీఎస్సీ ర్యాంకర్‌కు ఎంజేఎస్ సత్కారం

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

యూపీఎస్సీ ఫలితాల్లో 29వ ర్యాంక్‌తో హైడ్రో జియాలజిస్ట్‌గా ఎంపికైన జగదేవపూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిసత్యనారాయణ దంపతుల పెద్ద కూతురు తప్పెట్ల సంధ్య మహారాణిని సోమవారం మాదిగ జాగృతి సంఘం నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా విశారదన్ మహారాజ్ ఉద్యమ, మాదిగ జాతి మహా ప్రయాణాన్ని వివరించి మహానీయుల చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని మహానీయుల ఆలోచనలతో జాతికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధృవ మహారాజ్, మాదిగ ఉద్యోగ జాగృతి ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజన్ మహారాజ్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మహారాజ్, రాష్ట్ర నాయకులు భాస్కర్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.





# నకిలీ విత్తనాలతో రైతులకు తీవ్ర నష్టం

- **రుక్మాపూర్ లో 100 ఎకరాల్లో పంట నష్టం**
- **సీడ్ కంపెనీ విత్తనాల వల్లనే నష్టపోయామని పోలీసులకు ఫిర్యాదు**
- **సీడ్ కంపెనీ పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రైతుల ఆవేదన**

**చేగుంట, నవంబర్10, (సిద్దిపేట పవర్) :**

ఖరీఫ్ సీజన్లో అధిక దిగుబడి వస్తుందని రుక్మాపూర్ గ్రామంలో రైతులకు సీడ్ కంపెనీ వారు ప్రయోగాత్మకంగా వరి విత్తన రకం 45,47( మగరకం విత్తనం) కంపెనీవారు రైతులకు చెప్పడంతో సుమారు 40 మంది రైతులు దాదాపు 100 ఎకరాల్లో విత్తనం వేశారు దిగుబడి రాకపోవడంతో చేతికి వచ్చే సమయంలో పంట ఎండిపోవడం గొలలు రాకపోవడం వల్ల నిండా మునిగారు, ఖరీఫ్ సీజన్లో అధిక దిగుబడి వస్తుందని సీడ్ కంపెనీ వారిని నమ్మినందుకు కన్నీళ్లు మిగిలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు, ప్రయోగాత్మకంగా దొడ్డు రకం విత్తనమని కంపెనీ వారు చెప్పి ఇచ్చారని రైతులు తెలిపారు పంట కోతకు వచ్చే సమయంలో వారికి కొన్ని పొలాల్లో ఒకటి రెండు పిలకలు మాత్రమే వచ్చాయని మరికొంతమంది రైతుల పొలాల్లో మాత్రం మొత్తం పంట ఎండిపోయిందని రైతులకు తెలిపారు లాభం రావడం దేవుడేరుగు కానీ కనీసం పెట్టిన పెట్టుబడి దిగబడి కూడా రాక పోవడంతో రైతులు కన్నీరు పెట్టారు, ఎవరికి చెప్పాలో ఏం చేయాలో అర్థం కాక రైతులు వ్యవసాయ అధికారులకు చూపిన విత్తనాల ప్రాబ్లమ్ అని తెలిపారు. ఒక్కో రైతు ఎకరాకు సుమారు 25 వేల నుండి 30 వేల వరకు ఖర్చు చేశారు ఈ నకిలీ విత్తనాల పట్ల రుక్మాపూర్ గ్రామంలో 40 మంది రైతులకు సుమారు 20 లక్షల వరకు నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు, విత్తనాలు ఇచ్చిన సీడ్ కంపెనీ సూపర్వైజర్ ఫోన్ లేపడం లేదని కనీసం మళ్ళీ గ్రామానికి కూడా రావడం లేదని ఈ విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయామని అధికారులకు పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు పిలుకలు తక్కువగా వస్తున్నాయని సూపర్వైజర్ కు ఫోన్ చేస్తే అతను చెప్పిన మందు కొనుగోలు చేసి పొలానికి పిచికారి చేసామని దీంతో పంట పూర్తిగా మాడిపోయిందని గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్, గణేష్, లక్ష్మి, రామచంద్రం, మోహన్, అనే రైతులు లబోదిబోమన్నారు సదరు విత్తన కంపెనీ పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రైతుల కోరుతున్నారు.



# కారు బీభత్సం

- **ఆటోను తప్పించబోయి టీ స్టాల్‌లోకి దూసుకెళ్లిన కారు**
- **ఒకరికి స్వల్ప గాయాలు**
- **వల్లూరు జాతీయ రహదారి 44పై ఘటన**

**నార్సింగి, నవంబర్ 10 (సిద్దిపేట పవర్) :**

నార్సింగ్ మండలం వల్లూరు జాతీయ రహదారి 44పై సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాదు నుండి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఒక కారు ముందు అకస్మాత్తుగా వచ్చిన ఆటోను తప్పించబోయే క్రమంలో డ్రైవర్ కారు పై నియంత్రణ కోల్పోయాడు. దింతో అదుపు తప్పిన కారు రహదారి పక్కన ఉన్న టీ కొట్టు, కిరాణా దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలు కాగా ఒక ద్విచక్ర వాహనము ధ్వంసం అయింది. సమాచారం తెలుసుకున్న నార్సింగి ఎస్ఐ సృజన వారి సిబ్బంతో సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# గుర్తింపు లేని విత్తనాలను వాడొద్దు

- **జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్**

**చేగుంట, నవంబరు10 (సిద్దిపేట పవర్) :**



రైతులు గుర్తింపు లేని విత్తనాలను వాడవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం చేగుంట మండలం లోని రుక్మాపూర్ గ్రామంలో గుర్తింపులేని విత్తనాలతో పంట నష్టపోయిన రైతుల పంట పోలాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతులు గుర్తింపు లేని, ప్యాకింగ్ లేని విత్తనాలు తీసుకొని మోసపోవద్దన్నారు. సుమారు గ్రామంలో 40 మంది రైతులు 45 47 రకం వరి విత్తనాలు వేసి పంట నష్టపోవడం చాలా బాధకరమన్నారు. పంట నష్టపోయిన రైతులను వివరాలను ఆయన అడిగి తెలుపుకున్నారు. పంట నష్టపోయిన రైతుల పోలాలను శాస్త్రవేత్తల ద్వారా పరిశోధనలు జరిపి రైతులకు న్యాయం జరిగేవిధంగా చూస్తామాన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ అధికారులు హరి ప్రసాద్, యాదగిరి, రైతులు ఉన్నారు.

# కూలిపోయే దశలో బ్రిడ్జి పరిశీలించిన కార్యదర్శి

**నిజాంపేట, (సిద్దిపేట పవర్) :**

గత నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు రోడ్లు, చెరువులు, బ్రిడ్జిలు అతలాకుతలమైన విషయం విధితమే.. నిజాంపేట మండలం నందగోకుల్, కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఇస్సానగర్ వెళ్లే రోడ్డు మార్గంలో గల సరిహద్దు బ్రిడ్జి వరద ఉధృతికి బ్రిడ్జి కింద మట్టి కొట్టుకుపోయి పెద్ద గుంత ఏర్పడి ప్రమాదాన్ని సంతరించుకుంది. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి సోమవారం బ్రిడ్జి నీ పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. ఈ రోడ్డు గుండా భారీ వాహనాలు వెళ్ళవద్దని సూచించారు.








# డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**చేగుంట, నవంబరు 10 (సిద్దిపేట పవర్) :**

నార్సింగి మండలం సంకాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశవులు ఆధ్వర్యంలో సోమవారం పలు వార్డులలో ఎంపిడివో ప్రీతిరెడ్డి డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. సెంట్రల్ రూరల్ డెవలప్మెంట్, ఎస్టిఎఫ్ నిధులు రూ.13 లక్షల 50వేల రూపాయలతో గ్రామంలో 9,10 వార్డులతో పాటు ఎస్సీ కాలనీలో మూడు వందల మీటర్ల డ్రైనేజీల పనులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు. ఈ సందర్బంగా కేశవులు మాట్లాడుతు గ్రామానికి డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు కు గ్రామస్థుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ స్వన్న, పంచాయతీ కార్యదర్శి మౌనిక, కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసి సెల్ ఉపాధ్యక్షులు కేశవులు, గ్రామస్థులు పాల్గొన్నారు.